క్లుప్తంగా

తెలంగాణా హైకోర్టు జస్టిస్ 'మాటూరి'ని కలిసిన బైపా



జస్టిస్ మాటూరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న బైపా

దాబాగార్డెన్స్ : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ మాటూరి ఇందిరా ప్రియదర్శినిని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది బైపా అరుణ్‌కుమార్ బృందం గురువారం కలిసారు. విశాఖ విచ్చేసిన ఆమెను సర్క్యూట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జస్టిస్ మాటూరిని కలిసిన వారిలో న్యాయవాదులు వాగుపల్లి చిన్నారావు, గుడిపల్లి సుబ్బారావు, కె. నవీన్ సంపత్ తదితరులు ఉన్నారు.

మహారాణిపేట సీఐగా రమణమూర్తి



మహారాణిపేట సీఐ రమణమూర్తి

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ సీఐగా బి.రమణమూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ స్థానంలో గల సోమశేఖర్ ఆరిలోవ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రమణమూర్తిని నగర పోలీస్ కమిషనర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సీఐ రమణమూర్తి 2004 బ్యాచ్‌కు చెందిన వారు. ఈయన సీఐగా కొయ్యూరు, రాజాం టౌన్, విశాఖ హార్బర్, న్యూ పోర్టు, ద్వారకా సబ్ డివిజన్ క్రైం సీఐగా పని చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

వైభవంగా నీరాటోత్సవం



పెండ్లి కుమార్తె అలంకరణలో గోదాదేవి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం నీరాటోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో విశేష తిరుమంజన సేవ నిర్వహించారు. మేళతాళాలు, వేదమంత్రాల నడుమ గోదా, రంగనాథులను పెండ్లి కుమార్తె, కుమారులుగా తీర్చిదిద్దారు. అనంతరం విశేష అర్చన, నివేదన, నీరాజన మంత్ర పుష్పం చేపట్టి భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. భోగి పండగ సందర్భంగా ఆలయ కళ్యాణ మండపంలో గోదా రంగనాథుల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.పద్మావతి తెలిపారు.

పేదలకు 'కందుల' ఆసరా



కనకరాజు కుటుంబ సభ్యులకు దుస్తులు, ఆర్థిక సహకారం అందజేస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం: సంక్రాంతి వేళ పేదలకు అండగా ఉంటానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. చలికి వణుకుతున్న వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. గురువారం నేరెళ్లకోనేరులో గల తన కార్యాలయంలో పేదలకు బియ్యం బస్తాలు, దుప్పట్లు అందజేశారు. 34వ వార్డు చలువతోటకు చెందిన వడిసెల కనకరాజు బలవన్మరణం చెందిన సమాచారం మేరకు వారి కుటుంబ సభ్యులకు దుస్తులు, బియ్యం, ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట నారాయణరెడ్డి, కేఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ కందుల కేదార్‌నాథ్, 32వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కందుల బద్రీనాథ్ ఉన్నారు.

పతంగుల పండగ



అల్లిపురంలో గాలిపటాల దుకాణాలు



గాలిపటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- నగరానికి సంక్రాంతి శోభ
- జోరందుకున్న గాలిపటాల అమ్మకాలు

అల్లిపురం: సంక్రాంతి వచ్చిందంటే చాలు గాలిపటాల సందడి నగరంలో ప్రారంభమవుతుంది. ఎక్కడ చూసినా రంగు రంగుల గాలిపటాలు దుకాణాల్లో దర్శనమిస్తాయి. గాలిపటాలతో పెద్దవారు కూడా చిన్నపిల్లలైపోతారంటే అతిశయోక్తి కాదు. నగరంలో గాలిపటాల విక్రయాలంటే గుర్తుకు వచ్చేది మొదట అల్లిపురం అని చెప్పుకోవచ్చు. సంక్రాంతి సెలవులు కూడా తోడవటంతో పిల్లలు రోజంతా గాలిపటాలతో కాలక్షేపానికి సిద్ధమైపోతారు. రాకెట్, స్పైడర్‌మేన్, గ్రద్ద, క్రికెట్, టెన్నిస్ క్రీడాకారుల ఫొటోలతో పాటు పక్షులు, జంతువులు వంటి వాటికి గిరాకీ ఉంటుంది. మార్కెట్‌లో రూ.5 నుండి రూ.3,000 వరకు గాలిపటాల అమ్మకాలు జరుపుతున్నారు.

చరక.. గాలి పటాలను ఎగురవేసేందుకు చరక తప్పనిసరి. గాలిపటం పైకి వెళ్లిన తర్వాత దారం త్వరగా వదిలేందుకు, చుట్టేందుకు ఈ చరక ఉపయోగపడుతుంది. చరకను వెదురు కర్రతో తయారు చేస్తారు. మార్కెట్‌లో ప్లాస్టిక్, స్టీల్‌వి దొరుకుతున్నాయి. వీటి ధర రూ.20 నుండి రూ.500 వరకు ఉంటుంది.

గాలిపటాలకు ప్రత్యేకం అల్లిపురం.. గాలిపటాల వ్యాపారానికి పెట్టింది పేరు నగరంలోని అల్లిపురం. ఇక్కడ గాంధీ బొమ్మ పక్క నుండి వెళితే కుమ్మరవీధి రోడ్డులో గాలిపటాల విక్రయాల షాపులు దర్శనమిస్తాయి. వీధిలో గాలిపటాలను అందంగా అలంకరించి ఉంచుతారు. పిల్లలతో సందడిగా ఈ వీధి నిత్యం కళకళలాడుతుంటుంది. ఇక్కడ రిటైల్, హోల్‌సేల్‌గా అమ్మకాలు జరుపుతారు. నగరంలో పెద్ద పెద్ద దుకాణాలకు ఇక్కడి నుండే సరఫరా చేస్తుండటం విశేషం. విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాల వారు ఇక్కడి నుండే గాలిపటాలను కొని పట్టుకెళ్తుంటారు.

జాగ్రత్తలు తప్పనిసరి..
పిల్లలు గాలిపటాలు ఎగురవేసే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా పరిశీలించాలి. ఆనందాన్ని నింపే పతంగులు ఎగురవేసే సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు తప్పవు. భవనంపైకి ఎక్కి పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తుంటారు. ఆకాశంలో అందంగా ఎగురుతున్న గాలిపటం పైనే దష్టి పెట్టి డాబాలపై తిరుగుతుంటారు. భవనంపై ప్రహరీ లేకపోయినా, చిన్నగా ఉన్న భవనాలపైకి పిల్లలను పంపకూడదు. అదే విధంగా విద్యుత్ తీగలకు చిక్కుకునే గాలిపటాలను పిల్లలు తీసే ప్రయత్నం చేస్తే వారిని ఆపండి. లేకపోతే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. విశాలమైన ఖాళీ ప్రదేశంలో గాలిపటాలు ఎగురవేసేకోమని చెప్పాలి. తప్పనిసరి అయితే తల్లిదండ్రులు దగ్గరుండి గాలిపటాలను పిల్లలతో ఎగురవేయించటం ఉత్తమం.

పెరుగుతున్న ఆదరణ



గత రెండు సంవత్సరాలు కరోనా కారణంగా ఆదరణ తక్కువగా ఉంది. ఈ ఏడాది ఆదరణ బాగుంది. కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, జంషెడ్‌పూర్, హైదరాబాద్ ప్రాంతాల నుండి గాలిపటాలను దిగుమతి చేసుకుంటున్నాము. సంక్రాంతి రోజులతో పాటు ఏడాది పొడవునా గాలిపటాల అమ్మకాలు జరుపుతుంటాము.

–బొట్టా రమేష్,
గాలిపటాల వ్యాపారి,
అల్లిపురం

షాపులు పెరిగిపోయాయి



గతంలో విశాఖపట్నంలో అల్లిపురంలో మాత్రమే గాలిపటాలు దొరికేవి. మేము ఈ ప్రాంతంలో గత మూడు దశాబ్దాలుగా అమ్మకాలు జరుపుతున్నాం. ప్రస్తుతం రాష్ట్రం విడిపోయిన తరువాత విశాఖలో గాలిపటాల సందడి పెరిగింది. సంక్రాంతి సమయంలో గాలిపటాలకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం చాలా షాపులు ప్రారంభమయ్యాయి. దీంతో మాకు డిమాండ్ తగ్గింది.

–బొట్టా భవానీశంకర్,
గాలిపటాల వ్యాపారి, అల్లిపురం

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



భక్తుల పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: సహస్రాది తులసీ దళాల నడుమ సిరులతల్లి కనకమహాలక్ష్మి నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసిపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వి. రాంబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చే.. సంబరాలు తెచ్చే



వేడుకల్లో పాల్గొన్న వెంకటేశ్వరమెట్ట సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం: పల్లె ప్రజల ఇష్టమైన పండగ సంక్రాంతి అని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ అన్నారు. వెంకటేశ్వరమెట్ట-1, 2 సచివాలయాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. భోగి మంటలు వేసి ఆటపాటలతో సందడి చేశారు. పార్టీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, ఎం.రమేష్, ఆడారి వెంకట మహేష్, వెల్లంకి చిన్నమ్మలు, సచివాలయ అడ్మిన్ భార్గవ్, సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వసతి గదుల అద్దె పెంపు తగదు



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మహారాణిపేట : బీజేపీ నగర శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో వసతి గదుల అద్దె పెంపునకు నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన నిరసన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ టీటీడీలో వసతి గదుల అద్దె పెంపు వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రమోహన్, జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్ర, పార్టీ అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు, నాయకులు రామ్‌కుమార్, సంజీవరావు, కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. అనంతరం జేసీకి వినతిపత్రం సమర్పించారు.

బీసీ హక్కుల సాధనే లక్ష్యం

అల్లిపురం : దేశంలో బీసీ కులాల పరిస్థితి, సాంఘిక, ఆర్థిక రాజకీయంగా ఇంకా అస్పష్టంగానే ఉందని బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెబ్బిలి రవికుమార్‌కు నియామక పత్రం అందజేశారు. అసోసియేషన్ మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్ట్ ఎమ్మెస్సార్ ప్రసాద్‌ను నియమించారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సాత్విక జీవనమే.. ప్రాక్పశ్చిమ సమ్మేళనం



నావాణి సంచికను ఆవిష్కరిస్తున్న సీహెచ్‌ఎస్ఎన్ రాజు, కృష్ణమోహన్, బీఆర్‌కే రాజు

దాబాగార్డెన్స్ : సనాతన ధర్మం, పరమ గురువుల బోధనల ఆధారంగా జీవించడమే ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయమని జగద్గురు పీఠం భౌగోళిక అధ్యక్షుడు కె. గురుప్రసాద్ పేర్కొన్నారు. గురుపూజోత్సవాల్లో భాగంగా అకోశా హాల్లో జగద్గురు పీఠం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాస్టర్ ఈకే, మాస్టర్ పార్వతీ కుమార్ బోధనలకు 26 దేశాల్లో 65 బృందాలు ప్రభావితమై యోగ జీవనాన్ని గడుపుతున్నట్లు తెలిపారు. సంస్థ భౌగోళిక కో ఆర్డినేటర్, స్విట్జర్లాండ్ దేశీయుడు బుడ్జర్ మాట్లాడుతూ వివిధ భాషల్లోకి పరమగురువుల జ్ఞానాన్ని పంచిపెట్టి ఆధ్యాత్మికతను పెంపొందింప జేయడానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రీస్ దేశీయుడు హెన్రీ మాట్లాడుతూ మాస్టర్ ఈకే, మాస్టర్ కేపీతో పరిచయం ఏర్పడిన కారణంగా తనకు యోగపరమైన జీవన విధానం లభించిందన్నారు. కార్యక్రమంలో స్విట్జర్లాండ్ వనిత డాక్టర్ సెబీనా, స్పెయిన్ దేశీయుడు మైగేల్, సంస్థ అధ్యక్షుడు కెఎస్ శాస్త్రి, ఉపాధ్యక్షుడు ఎస్‌వీఎస్ మూర్తి, సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నావాణి స్వర్ణోత్సవ సభ..
జ్ఞానాన్ని సాధకులకు అందించడానికి మాస్టర్ ఈకే 1972లో నావాణి మాసపత్రికను నెలకొల్పారని జగద్గురు పీఠం సలహా మండలి సభ్యుడు సీహెచ్‌ఎస్ఎన్ రాజు చెప్పారు. 62వ గురుపూజోత్సవాల్లో గురువారం నావాణి దర్శన మాసపత్రిక స్వర్ణోత్సవ సభను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పసుమర్తి కృష్ణమోహన్, బీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు చెత్తబుట్టలు వినియోగించండి



మూడు చెత్త బుట్టలపై కొబ్బరితోటలో అవగాహన కల్పిస్తున్న జెడ్సీ శివప్రసాద్, కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం: మూడు చెత్త బుట్టల విధానం అవలంబిద్దాం.. అపారిశుధ్యాన్ని తరిమి కొడదాం అంటూ జోన్-4 జెడ్సీ శివప్రసాద్ పిలుపునిచ్చారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో కలిసి ఆయన గురువారం వార్డులో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా బౌడారారోడ్డు, కొబ్బరితోట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహస్తులందరూ మూడు చెత్తబుట్టలు తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తగా విడగొట్టి మూడు చెత్తబుట్టల్లో నిలువచేయాలని, ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు వాటిని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, సీవో నాగమణి, భాస్కరరావు, వెంకటేష్, వైట్, వలంటీర్లు, పారిశుధ్య కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

పేదోడి దుస్తులకు భలే గిరాకీ





సూర్యాబాగ్ ఫుట్‌పాత్ వస్త్ర దుకాణాల వద్ద సంక్రాంతి పండగను పురస్కరించుకుని కొనుగోలుదారుల రద్దీ

దాబాగార్డెన్స్ : సంక్రాంతి పండగంటే ఇంటిల్లిపాది చేసుకునే పండగ. కూలీ పనులు చేసుకునే వారి నుంచి సామాన్యులు.. ధనికుల వరకు ఈ పండగను ఆచారంగా జరుపుకుంటారు. పెద్దలకు బట్టలు పెట్టుకోవడం సాంప్రదాయం. ధనికులు పెద్ద మాల్స్‌కి వెళ్లి బట్టలు కొనుగోలు చేస్తుంటే.. పేదవాడు సూర్యాబాగ్ వద్ద ఉన్న ఫుట్‌పాత్ బట్టలకు క్యూ కట్టాడు. దీంతో ఆ ప్రాంతమంతా పేదోడి బట్టలకు కేరాఫ్‌గా నిలిచింది. సంక్రాంతి పండగ సందర్భంగా సూర్యాబాగ్ ఫుట్‌పాత్ దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి.

మోడీ పాలనలో అభివృద్ధి శూన్యం



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం: బీజేపీ పాలనలో దేశం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి సమావేశం గురువారం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జనవరి 17 నుంచి 30 వరకు జగనన్న ఇంటి లబ్ధిదారులను కలిసి అర్జీలపై సంతకాల సేకరణ, ఫిబ్రవరి 3న లబ్ధిదారులతో జిల్లా కేంద్రాల్లో సదస్సులు, ఫిబ్రవరి 22న విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు, జనవరి 23,24 తేదీల్లో ఆర్‌డీవో కార్యాలయాల వద్ద ధర్నాలు, 25న కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా, 30న కార్మికులు తలపెట్టిన పోరాటానికి సంఘీభావం, జనవరి 14న జీవో నంబర్ 1 భోగి మంటల్లో తగులబెట్టడం, 26న రాజ్యాంగ పరిరక్షణ దినంగా పాటించాలని, జనవరి 30న లౌకికవాద పరిరక్షణ దినంగా పాటించాలని తీర్మానించారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సమితి సభ్యులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత.. వివేకానంద



కేంద్ర గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులు



మహిళా డిగ్రీ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి



స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో..

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజనోత్సవం గురువారం నిర్వహించారు. విద్యార్థులచే స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పీవీ నూకరాజు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థిని పి. అనూష, పాఠకులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని చాటిన ఘనుడు
పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో వివేకానంద జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ వికాస్ పరిషత్ జాతీయ ప్రతినిధి రమేష్‌చంద్ జైన్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిని చాటి చెప్పిన ఘనత స్వామి వివేకానందునికే దక్కుతుందన్నారు. బీవీపీ ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, పంపాన వేంకటేశ్వరరావు, జీఎస్‌వీ మాణిక్యాలరావు, ఎంవీ రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ, శేఖరమంత్రి ప్రభాకర్, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో..
విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజనోత్సవాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఏజీవో డాక్టర్ కె. సుధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, ఎన్‌వీ పద్మకుమారి, సీహెచ్ తేజస్వి, కేవీఎస్ నాగలక్ష్మి, ఎస్. నిర్మలాకుమారి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..
అల్లిపురం: అల్లిపురం శాఖా గ్రంథాలయంలో గురువారం జరిగిన వివేకానందుని జయంతిలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, సిబ్బంది పోలితల్లి, శివ, పాఠకులు రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆధ్వర్యంలో..
మహారాణిపేట : జిల్లా కోర్టు సమీపంలో ఫ్రెండ్స్ అడ్వకేట్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విద్యాశంకర్, పి.గోవిందరావు, బగాది తులసీదాసు, హరిహరరెడ్డి, విజయకుమార్, కిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు

నెహ్రూ యువ కేంద్రంలో..
మహారాణిపేట: నెహ్రూ యువ కేంద్రం, శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో స్వామి వివేకానంద జయంతి జరిగింది. రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ కార్పొరేటర్ ఎస్. శేషులత, డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఎస్.మహేష్, క్షీరాబ్ది దుతి, గేదెల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



వివేకానందునికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జ్ఞాపికలు అందుకుంటున్న చిన్నారులు, సంస్థ సభ్యులు

స్వామి వివేకానంద సంస్థలో..
దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద జయంత్యుత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ప్రముఖ సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు పాల్గొని సంస్థ సేవలను కొనియాడారు. చిలకపేట శివాలయానికి రూ.10వేల చెక్కును సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ప్రముఖుల చేతుల మీదుగా అందజేశారు. డాక్టర్ జహీర్ అహ్మద్, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వివేకానందునికి నివాళులు
అల్లిపురం: వివేకానందుని 160వ జయంతి సందర్భంగా 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంథి గోపి, నాయకులు బొడ్డేటి ప్రసాద్, కణితి బ్రహ్మం, నీలాపు అయ్యప్పరెడ్డి సౌత్ జైలురోడ్డులో గల వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

క్షణికావేశంతోనే ఆత్మహత్యలు



ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బుష్ కావూరు

మహారాణిపేట: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రపంచంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, వీటిని నిరోధించడానికి సూసైడ్ ప్రివెన్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రముఖ మానసిక వైద్యుడు, ప్రవాస భారతీయుడు డాక్టర్ బుష్ కావూరు అన్నారు. గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్‌లో పాల్గొనడానికి వచ్చిన ఆయన గురువారం కేజీహెచ్ ఓపీ గేటు సమీపంలో ఉన్న వైద్యుల ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ఆత్మహత్య ఆలోచన ఉన్న వారితో మాట్లాడితే కొంత వరకు వీటిని నివారించవచ్చన్నారు. వర్జీనీయాలో స్థిరపడ్డ డాక్టర్ బుష్ విశాఖలో పుట్టి, 1981లో ఆంధ్రా మెడికల్ కాలేజీలో వైద్యునిగా పని చేశారు. గత 30 సంవత్సరాలుగా అమెరికాలో పని చేస్తున్నట్లు తెలిపారు.

పలు డిమాండ్లకు అంగీకారం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశాల మేరకు ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకట్రావు, సుధాకరరావుతో జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, సుబ్బారావు నాయకత్వంలో గురువారం చర్చలు జరిగాయి. చర్చల్లో ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రికల్ హెల్పర్, టర్న్‌కాక్‌లకు సెమిస్కిల్డ్ వేతనం రూ.18,500 చెల్లించేందుకు, 60 ఏళ్లకు పదవీ విరమణ పొందిన, చనిపోయిన కార్మికుల పిల్లలకు ఉపాధి కల్పించేందుకు, ఇంకా పలు డిమాండ్లకు సీఈ అంగీకరించారని యూనియన్ నాయకులు వెంకట్‌రెడ్డి, సుబ్బారావు తెలిపారు. శంకర్‌రెడ్డి, ఆదినారాయణ, మోహన్‌రావు, నూకరాజు పాల్గొన్నారు.